క్లుప్తంగా

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం



వాకతిప్ప సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. వాకతిప్పలో గురువారం రూ.40లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం, రూ.15 లక్షలతో ఏర్పాటు చేసిన చెరువునీటిని శుద్ధిచేసి తాగునీరుగా మార్చే మైక్రో వాటర్ ప్లాంట్లను ఆయన ప్రారంభించారు. సర్పంచ్ కొరిపెల్ల వెంకట నాగస్రవంతి, పీఏసీఎస్ చైర్మన్ మేడిశెట్టి గోవిందు, వైఎస్సార్ సీపీ నాయకులు కొరిపెల్ల ఆనందరావు, జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణిలతో కలిసి ఎమ్మెల్సీ తోట పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజలందరి అభ్యున్నతికి పాటుపడుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, గ్రామ కార్యదర్శి శివచక్రవర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా చైర్‌పర్సన్ దుర్గారాణి జన్మదిన వేడుక



పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి జన్మదినాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ నేత కొమ్ము రాంబాబు ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రిలో 100 మందికి పైగా రోగులకు చైర్‌పర్సన్ దుర్గారాణి పౌష్టికాహార కిట్లను అందజేశారు. స్థానిక తర్వాణీపేటలోని సాయిబాబా ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో దుర్గారాణి పేదలకు అన్నదానం నిర్వహించారు. చైర్‌పర్సన్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో కౌన్సిలర్లు, మున్సిపల్ స్టాఫ్, అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొని దుర్గారాణికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉచిత బస్సు పాసుల పంపిణీ



విద్యార్థులకు బస్సు పాసులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ లక్ష్మీనరసమ్మ తదితరులు

కె.గంగవరం: స్థానిక ఉన్నత పాఠశాలలో సుమారు 200 మంది విద్యార్థులకు సర్పంచ్ కోటి లక్ష్మీనరసమ్మ గురువారం ఉచిత ఆర్టీసీ బస్సు పాసులు పంపిణీ చేశారు. సర్పంచ్ లక్ష్మీనరసమ్మ, ఎంపీటీసీ సభ్యులు పెద్దిరెడ్డి తులసి సహకారంతో ఈ పాసులు ఉచితంగా అందించామని ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటేశ్వరరావు తెలిపారు. విద్యార్థులు ప్రతి రోజూ మానకుండా పాఠశాలకు రావాలని సర్పంచ్ కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, ఏపీఎస్ ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మండపేట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీగా పని చేసేందుకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కామర్స్ పోస్టులు మూడు, తెలుగు, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, బోటనీ, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు ఒక్కొక్కటి చొప్పున ఖాళీగా ఉన్నాయన్నారు. ఆయా సబ్జెక్టుల్లో పీజీ 55 శాతం మార్కులు సాధించిన వారు అర్హులన్నారు. పీహెచ్‌డీ, నెట్ సెట్ సర్టిఫికెట్లు ఉన్నవారికి ప్రాధాన్యతనిస్తామన్నారు. ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులను ఈ నెల 30 లోపు కళాశాలలో అందజేయాలన్నారు. వివరాలకు 9505318704 నంబర్‌కు సంప్రదించవచ్చని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళాలు

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిత్యాన్నదాన భవనం నిర్మాణానికి ఎం.వీరభద్రరావు, మంగతాయారు (అమలాపురం మండలం ఈదరపల్లి) రూ.25 వేలు, వి.రామకృష్ణ, సత్యవతి దంపతులు (తాళ్లరేవు) రూ.10,001 చొప్పున గురువారం విరాళాలు సమర్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఈ విషయం తెలిపారు. దాతలకు స్వామి వారి చిత్రపటాలను సిబ్బంది అందజేశారు.

రావమ్మా.. మహాలక్ష్మి..

- కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న మార్కెట్లు
- కిక్కిరిసిన బంగారం, పూజా సామగ్రి దుకాణాలు
- పెరిగిన ధరలు



మండపేటలో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న మహిళలు

మండపేట: శ్రావణ మాసం రెండో శుక్రవరం వరలక్ష్మీ వ్రతం ఆచరించేందుకు మహిళలు సిద్ధమయ్యారు. ఇంటిని శుభ్రం చేసుకోని కావాల్సిన పూజా సామగ్రి సమకూర్చుకున్నారు. దీంతో గురువారం మార్కెట్లకు శ్రావణ శోభ సంతరించకుంది. పూజా సామగ్రి, బంగారు రూపుల కొనుగోలతో దుకాణాలు కిటకిటలాడాయి.

శ్రావణమాసంలో వచ్చే శుక్రవారాలను మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొంటారు. రెండో శుక్రవారానికి హిందూ సాంప్రదాయంలో అధిక ప్రాముఖ్యత ఉంది. ఆ రోజున వరలక్ష్మి వ్రతం నిర్వహిస్తే సకల సౌభాగ్యాలు సిద్ధిస్తాయని నమ్మకంతో అమ్మవారి వ్రతం చేసుకునేందుకు అధిక ప్రాధాన్యమిస్తారు. పూజకు కావాల్సిన సామగ్రి కొనుగోలు కోసం వచ్చిన భక్తులతో గురువారం మార్కెట్లు కిటకిటలాడాయి. పట్టణంలోని కేపీ రోడ్డు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పూలు, పండ్లు, పత్రి, ఇతర పూజా సామగ్రి దుకాణాలు కొనుగోలుదారులతో కిక్కిరిశాయి. బంగారం దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడాయి. పరిసర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు మండపేట తరలివచ్చి పూజాసామగ్రి, బంగారు రూపులు కొనుగోలు చేశారు.

చుక్కలు తాకిన ధరలు

పూజా సామగ్రి ధరలు సామాన్యులకు చుక్కలను చూపించాయి. పూజకు వినియోగించే మామిడి ఆకులు, ఇతర పత్రి సామగ్రిని చాగల్నాడు నుంచి వ్యాపారులు తీసుకువచ్చి అమ్మకాలు సాగించారు. తామరపువ్వులు జత రూ.60 నుంచి 90లు వరకు అమ్మకాలు చేయగా, యాపిల్ పండ్లు జత రూ.40 నుంచి రూ.50, దానిమ్మకాయ ఒక్కొక్కటి రూ.30లు వరకు అమ్మకాలు జరిగాయి. అదేవిధంగా పల్లెల్లో విరివిగా దొరికే జమ్మి, మామిడి తదితర రకాలతో కూడిన పత్రి ధరలకు రెక్కలొచ్చాయి.

ద్రాక్షారామలో..

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో వరలక్ష్మీ వ్రతం సందడి నెలకొంది. పూలు, పండ్లు, బంగారు లక్ష్మీ రూపులు, నూతన వస్త్రాలు, గాజులు తదితర వస్తువుల కొనుగోలు కోసం మహిళలు తరలిరావడంతో మార్కెట్లు సందడిగా మారాయి. చుట్టుపక్కల 50కి పైగా గ్రామాల నుంచి ప్రజలు కొనుగోళ్లకు ద్రాక్షారామ వచ్చారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఎస్సై బి.వినోద్, అడిషనల్ ఎస్సై ఎస్.భుజంగరావు నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

తాపేశ్వరం రోడ్డుకు లైన్ క్లియర్

- పనుల నిర్వహణకు నిధుల విడుదల
- నేడు పునఃప్రారంభం
- యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆదేశం



రోడ్డు పనులపై అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: అసంపూర్తిగా నిలిచిపోయిన ద్వారపూడి రోడ్డు అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు లైన్ క్లియరైంది. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చొరవతో పెండింగ్ బిల్లులు విడుదల కాగా శుక్రవారం నుంచి పనులను పునఃప్రారంభించి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఎమ్మెల్సీ తోట ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. మండపేట నుంచి తాపేశ్వరం మీదుగా జెడ్ మేడపాడు వరకూ 6.5 కిలోమీటర్ల మేర రోడ్డు అభివృద్ధికి సీఆర్ఎఫ్ నుంచి రూ.12 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పనపాడు రైస్‌మిల్లు వద్ద నుంచి జెడ్ మేడపాడు వంతెన వరకు 2.6 కిలోమీటర్లు బీటీ రోడ్డు, మండపేట నుంచి ఇప్పనపాడు వరకూ సీసీ రోడ్డు నిర్మించాలి. బీటీ రోడ్డు పనులు పూర్తికాగా వాహనాలు దూసుకువెళుతున్నాయి. తాపేశ్వరం, ఇప్పనపాడు గ్రామాల్లో 1,850 మీటర్ల మేర ఒక వైపు, 750 మీటర్ల మేర రెండు వైపులా సీసీ రోడ్డు నిర్మించారు. సాంకేతిక అవరోధాలతో మిగిలిన పనులు జనవరి నుంచి అసంపూర్తిగా నిలిచిపోయాయి. పనులు జరగని చోట రోడ్డు పెద్దపెద్ద గోతులతో ప్రమాదభరితంగా తయారై రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

ప్రత్యేక చొరవ చూపిన ఎమ్మెల్సీ తోట

సమస్యపై ప్రత్యేకంగా దృష్టి సారించిన ఎమ్మెల్సీ తోట అమరావతిలో ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులతో మాట్లాడి నిధుల విడుదలకు లైన్ క్లియర్ చేశారు. ఆర్అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్లతో గురువారం రోడ్డును పరిశీలించి సత్వరమే పనులు చేపట్టాలని ఆదేశించారు. పూర్తి నాణ్యత ప్రమాణాలతో యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ వివిధ కారణాలతో రోడ్డు పనుల్లో జాప్యం జరిగిందన్నారు. పనులు నిలిచిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారని, అందుకు తాను కూడా బాధపడుతున్నానన్నారు. నిరాటంకంగా పనులు పూర్తవుతాయని తెలిపారు. ప్రజల కోసం పని చేయడానికే తానున్నానని తన బాధ్యతను విధిగా నిర్వర్తించి ప్రజాభిమానాన్ని చూరగొంటానని ఎమ్మెల్సీ తోట తెలిపారు. త్వరితగతిన రోడ్డు పనులు పూర్తిచేస్తామని స్పష్టం చేశారు. పనులకు ఆటంకం కలుగకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీస్, ఆర్అండ్‌బీ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఆర్అండ్‌బీ డీఈ రాజేంద్ర, జేఈ సూర్యనారాయణ, ఎంపీపీ వుండమట్ల శ్రీనివాసు, సేవాదళ్ మండల కన్వీనర్ పోతుల రాంబాబు, పార్టీ నాయకులు కొప్పిరెడ్డి ప్రసాద్, నాగిరెడ్డి రాంబాబు, సంగిశెట్టి రమేష్, పోతుల దుర్గా ప్రసాద్, గ్రంధి సూరిపండు, సురేష్ పాల్గొన్నారు.

జయహో భారత్



ఇస్రో ఆంగ్ల అక్షరాల ఆకృతిలో వెదురుపాక జెడ్పీ విద్యార్థులు



ద్రాక్షారామలో భారత్ ఆకృతిలో విద్యార్థుల మానవహారం



జాతీయ పతాకంతో ర్యాలీ చేస్తున్న మోడరన్ విద్యార్థులు

రామచంద్రపురం/రామచంద్రపురం రూరల్: చంద్రయాన్-3 ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించిన ఇస్రో శాస్త్రవేత్తలకు జై కొడుతూ.. భారత దేశ కీర్తిని చాటుతూ.. విద్యార్థులు గురువారం భారీ ప్రదర్శనలు, మానవహారాలు నిర్వహించారు. రామచంద్రపురం మోడరన్ విద్యా సంస్థల ఆధ్వర్యాన రామచంద్రపురం పట్టణ వీధుల్లో విజయభేరి యాత్ర కన్నుల పండువగా సాగింది. మోడరన్ జూనియర్ కాలేజీ విద్యార్థులు 750 మంది 750 అడుగుల జాతీయ జెండాను ప్రదర్శిస్తూ జై చంద్రయాన్ అంటూ నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. చంద్రయాన్-3 విజయంతో భారత్ ఖ్యాతి ప్రపంచ శిఖరాగ్రాన చేరిందని విద్యా సంస్థల అధినేత జీవీ రావు కొనియాడారు. కార్యక్రమంలో మోడరన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రాజేష్, వైస్ ప్రిన్సిపాల్ పి.ప్రకాశ్, అకడమిక్ అడ్వైజర్ సీహెచ్ శ్రీనివాస, సిబ్బంది పాల్గొన్నారు. ద్రాక్షారామలో స్థానిక సూర్య హైస్కూల్ విద్యార్థులు సుమారు 800 మంది ర్యాలీ, మానవహారం నిర్వహించారు. జయహో భారత్ అంటూ నినదించారు. ప్రధాన రహదారిపై ర్యాలీ చేసి, బోసు బొమ్మ సెంటర్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా భారత దేశ ఆకృతిలో మానవహారం నిర్వహించారు.

రాయవరం: చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడంతో భారతదేశ కీర్తిప్రతిష్టలు ప్రపంచ వ్యాప్తంగా ఇనుమడించాయి. ప్రయోగం విజయవంతం కావడానికి ఇస్రో శాస్త్రవేత్తలు చేసిన కృషి, పట్టుదల ప్రధానంగా నిలిచాయి. ఈ నేపథ్యంలో మండలంలోని వెదురుపాక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 'ఇస్రో' శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలియజెప్పడంలో భాగంగా హెచ్ఎం పి.రాంబాబు ఆధ్వర్యంలో 'ఇస్రో' ఆంగ్ల అక్షరాల ఆకృతిగా ఏర్పడ్డారు.

సామాన్యులందరికీ మేలు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- వాకతిప్పలో గడప గడపకూ మన ప్రభుత్వం



వాకతిప్ప గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అమలు చేస్తున్న పథకాలు అన్ని వర్గాల ప్రజలకు మేలు చేస్తున్నాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. వాకతిప్పలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, కార్యదర్శి శివ చక్రవర్తి, సచివాలయ ఉద్యోగులతో కలిసి ఎమ్మెల్సీ ప్రజా సమస్యలపై చర్చించారు. ప్రభుత్వ పథకాలతో తమకు ఎంతో మేలు జరుగుతుందని ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. సాంకేతిక సమస్యలతో ఎవరికైనా ప్రభుత్వ లబ్ధి మంజూరుకాకపోతే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని ఎమ్మెల్సీ తోట అన్నారు. సర్పంచ్ కొరిపెల్ల వెంకట నాగస్రవంతి, వైఎస్సార్ సీపీ నాయకులు కొరిపెల్ల ఆనందరావు మాట్లాడుతూ గ్రామంలో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్సీ తోటకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మేడిశెట్టి గోవిందు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాస్, సచివాలయాల మండల కన్వీనర్ పాలింగి శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ సేవాదళ్ కన్వీనర్ పాలింగి కృష్ణకిశోర్, మేడిశెట్టి దుర్గారావు పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు కృషి చేయాలి



సూర్యనారాయణరెడ్డిని సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

రాయవరం: ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని అందుకనుగుణంగా సాధన చేయాలని అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. రాయవరంలోని విజ్ఞాన్ జూనియర్ కళాశాల సీనియర్ విద్యార్థులు, జూనియర్ విద్యార్థులకు ఏర్పాటు చేసిన ఫ్రెషర్స్ డే కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, ప్రణాళిక ప్రకారం విద్యనభ్యసించాలన్నారు. సమావేశంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఉమామహేశ్వరి, ఎంపీపీ నౌడు వెంకటరమణ, చాణక్య ఆస్పత్రి అధినేత డాక్టర్ జీఎస్ఎన్‌రెడ్డి తదితరులు విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్ సేవా సంస్థ సభ్యులు పులగం నాగిరెడ్డి దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో వీఎస్ఆర్ రూరల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.సతీష్‌రెడ్డి, డైరెక్టర్ ఎం.శేషవేణి, విజ్ఞాన్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.అచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

కె.గంగవరం: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల ఆప్తులను కోల్పోయిన బాధిత కుటుంబాలకు దాతలు గురువారం నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. మాసాబత్తుల లక్ష్మణరావు (అముజూరు), దాసరి అప్పారావు (బాలాంత్రం), పాము దశరథుడు (మసకపల్లి), కుంచే మనమ్మ (కూళ్ల) ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులకు పోలిశెట్టి లక్ష్మీ సుబ్బారావు చారిటబుల్ మెమోరియల్ ఫౌండేషన్ తరఫున జనసేన నాయకుడు పోలిశెట్టి చంద్రశేఖర్ నిత్యావసర సరకులు పంపిణీ చేశారు.

కుండపోత వాన

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో ఆకాశం గురువారం సాయంత్రం ఒక్కసారిగా మేఘావృతమై కుండపోతగా వాన కురిసింది. దీంతో రోడ్లు, డ్రైన్లు వర్షపు నీటితో నిండిపోయాయి. ఉదయం నుంచీ ఎండ బాగానే కాసినా సాయంత్రం అయ్యేసరికి అప్పటికప్పుడు మేఘాలు కమ్ముకుని, రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి.

గొల్లపాలెం హైస్కూల్‌కు రెండోసారి క్రీడా ప్రతిభా అవార్డు



ప్రతిభ చూపిన విద్యార్థులతో హెచ్ఎం, పీడీ, ఉపాధ్యాయులు

కాజులూరు: పాఠశాల విద్యా శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన స్కూల్స్ గేమ్స్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన గొల్లపాలెం ప్రభుత్వ హైస్కూల్ వరుసగా రెండోసారి క్రీడా ప్రతిభా అవార్డుకు ఎంపికైంది. హైస్కూల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన సభలో ప్రధానోపాధ్యాయిని ఎస్ఎస్‌బీ సుశీలామణి ఈ వివరాలు వెల్లడించారు. కాకినాడ జిల్లా పరిధిలో మొత్తం 5 పాఠశాలలు ఎంపికవగా, వీటిలో తమ పాఠశాల కూడా ఉందని తెలిపారు. ఈ ఏడాది 111 పాయింట్లతో తమ పాఠశాల జిల్లాలో రెండో స్థానంలో నిలిచిందన్నారు. సాఫ్ట్ బాల్, బేస్‌బాల్, అథ్లెటిక్స్, వాలీబాల్, రైఫిల్ షూటింగ్, స్విమ్మింగ్‌లో 19 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో రాణించారు. తద్వారా తమ పాఠశాల ఈ అవార్డుకు ఎంపికైందని చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, హెచ్ఎం సుశీలామణిని, పీడీ జి.సునీల్‌కుమార్‌ను రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, ఎంపీపీ మాతా భారతి, జెడ్పీటీసీ సభ్యుడు వనుం వెంకట సుబ్బారావు, సర్పంచ్ పి.ప్రసన్న మౌనిక, ఎంపీటీసీ సభ్యురాలు జె.సత్య పద్మజ, ఉప సర్పంచ్ టి.భువనేశ్వరి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎం.నాగరాజు అభినందించారు.

శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానమే మానవ ప్రగతికి సోపానం

కపిలేశ్వరపురం: శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానమే మానవ ప్రగతికి సోపానమని జన విజ్ఞానవేదిక మండల కార్యవర్గ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు పెద్దింశెట్టి లెనిన్‌బాబు, వాసంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. వేదిక మండల మహాసభ అంగరలో గురువారం నిర్వహించారు. చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతమైన నేపథ్యంలో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. నూతన కార్యవర్గ కమిటీ ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎం.సూర్యనారాయణ, అధ్యక్షుడిగా పెద్దింశెట్టి లెనిన్‌బాబు, ప్రధాన కార్యదర్శి వాసంశెట్టి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా ఎంవీ రమణారావు, కేఎస్ఎం రాణి, కార్యదర్శిలుగా పి.సురేంద్ర, జె.శ్రీనివాస్, కోశాధికారిగా వై.రాధాకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

కె.గంగవరం: యోగా సాధన చేయడం ద్వారా ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని విశ్వ మానవతా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాస్ చౌదరి అన్నారు. కె.గంగవరం రామాలయం వద్ద గురువారం హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా శ్రీనివాస్ చౌదరి యోగా థెరపిస్ట్ నాగలక్ష్మి పాల్గొన్నారు. యోగా సాధన, ఆహారం, ఆయుర్వేదం, ప్రకృతి చికిత్సల గురించి రోగులకు వివరించారు. ప్రతి రోజూ ధ్యానం, యోగా సాధనతో పాటు ప్రకృతి చికిత్సలు పాటిస్తే రుగ్మతలకు గురి కాకుండా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండవచ్చని చెప్పారు. అనంతరం 130 మంది రోగులకు ఉచితంగా హోమియోపతి మందులు పంపిణీ చేశారు. వైద్య సేవకులు సత్యనారాయణ, వీరాంజనేయులు, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.

తడి-పొడి వ్యవసాయంపై నేడు అవగాహన కార్యక్రమం

రామచంద్రపురం రూరల్: తడి-పొడి వ్యవసాయంపై యనమదల గ్రామంలో రైతులకు అవగాహన కల్పించనున్నామని మల్లెల రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ జిల్లా మేనేజర్ బీర అనిల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ యనమదల, తాడిపల్లి, అగ్రహారం గ్రామాల రైతులకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కోర్ కార్బన్ ఎక్స్ సొల్యూషన్స్ సంస్థ పర్యవేక్షణలో నిర్వహించనున్న కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు పాల్గొంటారని తెలిపారు. దీనిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.